క్లుప్తంగా

ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో మంచి గుర్తింపు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బాలాజీచెరువు: ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని లయన్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. రామరావుపేట లయన్స్‌హాల్లో శనివారం లయన్స్ ఎలైట్ క్లబ్, విజన్ ఆధ్వర్యంలో 21 లయన్స్ క్లబ్ సభ్యులందరూ కలసి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంకితభావంతో పనిచేయాలని, అప్పుడే భవిష్యత్తులో మంచి పౌరులు ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవీంద్రనాథ్, జోన్ చైర్మన్ సత్యనారాయణ, గంటి భాస్కరరావు, పాపారావు, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

యంగ్‌మైండ్ సేవలు అభినందనీయం



యంగ్‌మైండ్ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ, గాయత్రిని సత్కరిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

బాలాజీచెరువు: యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్‌బీఐ మేనేజర్ ఉమ పేర్కొన్నారు. ఎస్‌బీఐ మెయిన్‌రోడ్డు బ్రాంచ్‌లో శనివారం యంగ్‌మైండ్ సంస్థ అధ్యక్షుడు, నడకుదురు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకడ వెంకటరమణ (చిన్న మాస్టారు)ను సత్కరించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఉమ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తితో పాటు సమాజంలో తన వంతు సేవా బాధ్యతగా విద్య, వైద్యపరంగా సేవ కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. వెంకటరమణతోపాటు ఇల్లపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలు గాయత్రి దేవిని సత్కరించారు.

పోలీస్ అధికారుల సంఘ నాయకుడి మృతికి సంతాపం



కంచర్లపల్లి వెంకటచలపతిరావు (ఫైల్)

కాకినాడ క్రైం: పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర నాయకుడు, మాజీ అధ్యక్షుడు కంచర్లపల్లి వెంకటచలపతిరావు మృతికి పలువురు సంఘ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారుల సంఘ అధ్యక్షుడు గంగిరెడ్డి బలరాం, మాజీ ట్రెజరర్, జాయింట్ సెక్రటరీ మట్టా వెంకటరమణమూర్తి, మాజీ అధ్యక్షుడు జి.బ్రహ్మాజీరావు, సెక్రటరీ వైఆర్‌కే శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. పోలీసుల సంక్షేమానికి చలపతిరావు కృషి చేశారని వారు కొనియాడారు.

ప్రమాదభరితంగా ఏటిగట్టు రహదారి

- కోతకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు
- వర్షాకాలంలో ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- నివారణ చర్యలు తీసుకోవాలంటున్న ప్రయాణికులు

కరప: తుల్యభాగ డ్రెయిన్ గట్టు కోతకు గురై రోడ్డు కుంగుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు, వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. అయిదారు మండలాల్లోని మురికినీరు, ముంపునీరు సముద్రంలోకి తీసుకెళ్లే తుల్యభాగ డ్రెయిన్ మండలంలో వేళంగి నుంచి ప్రారంభమై యండమూరు, వడ్డిపాలెం, పెదకొత్తూరు, వేములవాడ, కొంగోడు, గొర్రిపూడి మీదుగా తాళ్లరేవు మండలం పటవల వద్ద సముద్రంలో కలుస్తుంది. తుల్యభాగ ఏటిగట్టు రోడ్డు కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాలను అనుసంధానం చేస్తుంది. వేములవాడ, వలసపాకల, వాకాడ, కరప తదితర గ్రామాలవారు ఈరోడ్డుపై ప్రయాణించి ఆయా మండలాలకు, ద్రాక్షారామ, కోటిపల్లి పుణ్యక్షేత్రాలకు వెళుతుంటారు. గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు తదితర గ్రామాలవారు మండల కేంద్రానికి వెళ్లేందుకు ఈరోడ్డు వెంబడి రాకపోకలు సాగిస్తుంటారు.

వర్షాకాలంలో ఏటా ఏటిగట్లకు తూట్లు

ఏటా కురిసే వర్షాలకు, తుపాన్లు, వరద ప్రవాహం పోటెత్తినప్పుడు తుల్యభాగ డ్రెయిన్‌గట్టు కొన్నిచోట్ల కోతకుగురైనా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తుల్యభాగ డ్రెయిన్ గట్టు వెంబడి వేములవాడ నుంచి గొర్రిపూడి వరకు ఉండే ఏటిగట్టు రోడ్డు ఒకచోట భారీగా కోతకు గురైంది. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయం రోడ్డుకోత కనిపించక ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. కోతకు గురైన ప్రాంతాల్లో కనీసం హెచ్చరిక బోర్డులు పెట్టడం లేదని, అధికారుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తుల్యభాగ డ్రెయిన్‌గట్లు పటిష్టపరచి, కోసుకుపోయిన రోడ్డును సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురవుతున్న వేములవాడ ఏటిగట్టు రోడ్డు దుస్థితి



ఏటిగట్టు రోడ్డు కోతకు గురవడంతో ఏర్పడిన భారీ గొయ్యి

ఏటిగట్లను పటిష్టపర్చాలి



వేములవాడ ఏటిగట్టు రోడ్డుపై ప్రయాణం ప్రమాదభరితంగా తయారైంది. వేములవాడ, గొర్రిపూడి గ్రామాల మధ్య ఒకచోట చాలా ఎక్కువగా ఏటిగట్టు కోతకు గురైంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేటప్పుడు పక్కకు వెళ్లేందుకు జాగాలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కోతకు గురైన గట్టుపటిష్ట పర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కమిడి మంగాదేవి, సర్పంచ్, వేములవాడ

గోతులను పూడ్పించాలి



మూడుమండలాలను కలిపే ఏటిగట్టు రోడ్డు చాలాచోట్ల కోతకు గురవుతోంది. వర్షాకాలంలో మరీ ఎక్కువగా కోతకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రి సమయంలో పక్కకువెళితే అదుపుతప్పి వాహనచోదకులు గోతుల్లో పడిపోతున్నారు. వేములవాడ ఏటిగట్టు రోడ్డు కోతకు గురైన ప్రాంతాలు గుర్తించి, గోతులు పూడ్పించేలా చర్యలు తీసుకోవాలి.

– గుత్తుల సత్తిబాబు, వేములవాడ శివారు సిరిగలవానిపల్లిలంక

11న 'రెడ్ రన్'

కాకినాడ క్రైం: లైంగిక సంక్రమణ వ్యాధులు, హెచ్ఐవీ, ఎయిడ్స్, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కోసం ఈ నెల 11న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రెడ్ రన్ పేరుతో 5కే మారథాన్ నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ శనివారం ఓ ప్రకటన పేర్కొన్నారు. 17–25 ఏళ్ల మధ్య ఉన్న విద్యార్థులు, యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కాకినాడ కుళాయి చెరువు వద్ద ఉన్న వివేకానంద గేటు వద్ద ఉదయం 6.30 రెడ్ రన్ ప్రారంభం అవుతుందని అన్నారు. జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు మూడు ప్రత్యేక ట్రాక్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు, రెండవ స్థానంలో నిలిచిన అభ్యర్థికి రూ.7 వేలు చొప్పున రివార్డులు ఇస్తామన్నారు. గెలుపొందిన అభ్యర్థులను రాష్ట్రస్థాయి పోటీకి పంపిస్తామని అన్నారు. వివరాల కోసం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ బాలాజీని 9949495022 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

నిబంధనల బేఖాతరుపై చర్యలు తీసుకోవాలి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): మిలాద్ ఉల్ నబీ సందర్భంగా కాకినాడ నగరంలో నిబంధనలు బేఖాతర్ చేస్తూ పాలస్తీనా, పాకిస్తాన్ జెండాలతో ర్యాలీ నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరావు డిమాండ్ చేశారు. శనివారం ఎస్పీ బిందుమాధవ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ర్యాలీ చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు గూటూరి పద్మ, జ్యోతుల రాజేష్ ఉన్నారు.

గణనాథునికి ఘనంగా వీడ్కోలు

- సాగరంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం
- వీధుల్లో ఊరేగింపు సందడి
- ఉత్సాహంగా పాల్గొన్న యువత

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. స్థానిక వార్ఫు రోడ్డులోని 4 ప్రాంతాల్లో నిమజ్జనం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుల విగ్రహాలను ఉప్పుటేరులో నిమజ్జనం చేశారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన చిన్న గణనాథుల విగ్రహాలను కుటుంబ సభ్యులతో సహా అందరూ వచ్చి భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. వివిధ ప్రాంతాలు నుంచి భారీ ర్యాలీగా వచ్చిన యువకులు తీన్‌మార్ నృత్యాలు చేస్తూ ఈ నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. కాకినాడలో 4 ప్రాంతాల్లో 10 బోట్లు, 30 మంది గజ ఈతగాళ్ల సహకారంతో ఈ నిమజ్జనోత్సవం నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బందితో సహా పలు శాఖలకు చెందిన అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. నగరంలోని వివిధ కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలతో స్థానిక మెయిన్‌రోడ్డు మీదుగా జగన్నాథపురం వరకూ ఊరేగింపు సాగింది.



కాకినాడ వలసపాకల వద్ద గణేశ్ విగ్రహం ఊరేగింపు

వీధుల్లో ఊరేగింపు సందడి

కాకినాడలో దాదాపు అన్ని వీధుల్లో వినాయకుడి విగ్రహాలు ప్రతిష్ఠించారు. 9 రోజులుగా పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనం చేసేందుకు ఆయా కమిటీలు భారీ ఏర్పాట్లు చేశారు. తమ ప్రాంత మండపాల నుంచి నిమజ్జనం ప్రాంతం వరకూ భారీ ఊరేగింపు నిర్వహించారు. బాణసంచా కాల్పులు, డప్పులు, సన్నాయి మేళంతో ఊరేగింపు నిర్వహించడంతో వీధుల్లో సందడి వాతావరణం కనిపించింది. చిన్న, పెద్దా తేడా లేకుండా కుటుంబ సభ్యులందరూ ఊరేగింపులో పాల్గొన్నారు.

నగరంలో ప్రత్యేక బందోబస్తు

నగరంలో నిమజ్జనోత్సవం సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు, గొడవలు జరుగకుండా పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రధాన కూడళ్లతోపాటు పలు ప్రాంతాల్లో పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. ఊరేగింపులు వద్ద పోలీసులు పహారా కాశారు.

గణపతి లడ్డూ రూ.75 వేలు

కరప: కొంగోడు శెట్టిబలిజపేటలోని వినాయకుడి 15 కిలోల లడ్డూ ప్రసాదానికి వేలం వేయగా రూ.75,500కు కోటా శ్రీనివాసరావు, భూ లక్ష్మీ దంపతులు దక్కించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది లడ్డూ వేలంలో అధిక ధర పలికిందని నిర్వాహకులు తెలిపారు. వేలంలో పునం నారాయణరావు, కోట వెంకటరమణ, కోట నాగయ్య పాల్గొన్నారు.



వేలంలో గణేశ్ లడ్డూను దక్కించుకున్న కోట శ్రీనివాసరావు



గణేశ్ నిమజ్జనాలను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఊరూవాడా నిమజ్జనోత్సవ సందడి

కాకినాడ రూరల్: వినాయక నవరాత్రులు ముగియడంతో కాకినాడ రూరల్‌లో ఏర్పాటు చవితి పందిళ్ల వద్ద నెలకొల్పిన వినాయక విగ్రహాలను మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి కాలువల్లో, సాగరంలో నిమజ్జనం చేశారు. సూర్యారావుపేట బీచ్‌తోపాటు ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ చీడిగ వద్ద అనుమతి ఇవ్వడంతో ఆయా ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నిమజ్జనాలు జరిగాయి. నిమజ్జనాలు అనంతరం భక్తులు స్నానాలు ఆచరించి వారి ప్రాంతాలకు చేరుకున్నారు. తిమ్మాపురం, సర్పవరం ఇంద్రపాలెంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



జగన్నాథపురం ఉప్పుటేరు గణనాథుల విగ్రహాల నిమజ్జనం



బీచ్‌లో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న యువకులు

ఆలోచిద్దాం.. ప్లాస్టిక్‌ను వదిలేద్దాం



జి.వేమవరంలో అన్నదాన కార్యక్రమంలో స్టీలు కంచాల వినియోగం

తాళ్లరేవు: ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల్లో ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంభవించే అవకాశం ఉంటుందని జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు ఒక వినూత్న ఆలోచన చేశారు. ప్రధానంగా వేడి ఆహార పదార్థలను ప్లాస్టిక్ ప్లేట్లలో తినడం ద్వారా ప్లాస్టిక్ కణాలు ఆహారంలో ప్రవేశించి అవి క్యాన్సర్ కారకాలు మారతాయని తెలుసుకుని, గ్రామంలో ఏ ఒక్కరూ ప్లాస్టిక్ ప్లేట్లలో తినకూడదని నిర్ణయించుకున్నారు. తొలివిడతగా వంద ప్లేట్లను కొనుగోలు చేసి గ్రామంలోని గొర్రిపూడి పొలిమేర కాలువ వద్ద పుణ్యమంతుల ఫకీర్రావు సెంటర్ వద్ద నెలకొల్పిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు, మహిళలకు తాను కొనుగోలు చేసిన స్టీలు ప్లేట్లలో భోజనాలు వడ్డించి అవగాహన కల్పించారు. రెండు వేల స్టీలు ప్లేట్లు కొనుగోలు చేసి పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామని, ఎటువంటి కార్యక్రమానికైనా ప్రజలు వాటిని తీసుకువెళ్లవచ్చని సూరిబాబు తెలిపారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

సామర్లకోట: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖాధికారి వి.మురళీధర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి పి.రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తహసీల్దార్, పోలీసు, వ్యవసాయశాఖల సహకారంతో గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నామని ప్రత్యేకాధికారి తెలిపారు. గ్రామాల్లో ప్రైవేటు డీలరు వద్ద గ్రామ వీఏఏ, సచివాలయ ఉద్యోగిని నియమించి ఎరువుల విక్రయంలో అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసున్నట్టు ఆయన చెప్పారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతులకు 3,034 మెట్రిక్ టన్నుల ఎరువులు కావలసి ఉండగా 2,698 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. మిగిలిన 336 మెట్రిక్ టన్నులు ఒకటి, రెండు రోజుల్లో స్టాక్ వస్తుందని తెలిపారు. తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి, ఏఎస్సై జి. శ్రీనివాసు పాల్గొన్నారు.

వృద్ధులకు గొడుగుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట బర్మా కాలనీ వద్ద వృద్ధులకు నారాయణ సేవ వ్యవస్థాపకురాలు, డాక్టర్ ఎం.వరలక్ష్మి శనివారం గొడుగులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్త పరంజ్యోతి తదితరులుపాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో జేఎన్‌టీయూకేకు ప్రత్యేక గుర్తింపు



అధ్యాపకులను సత్కరిస్తున్న జేఎన్‌టీయూకే వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీకి ప్రత్యేక గుర్తింపు ఉందని వీసీ, ప్రొఫెసర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు.జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ మాట్లాడుతూ 11 జిల్లాలో 164 ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలలు ఉన్నాయని, అనుబంధంగా 2,30,000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఎంతోవేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, క్లీన్ ఎనర్జీ, అంతరిక్ష పరిశోధన, బయోటెక్నాలజీ వంటి రంగాలు దుసుకెళ్తున్న తరుణంలో వాటికి అనుగుణంగా విద్యార్థులు వినూత్నమైన ఆలోచనలు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు.అనంతరం అధ్యాపకులు, విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ కోటేశ్వరరావు, రెక్టార్ సుబ్బారావు, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన నాటిక ప్రదర్శనలు



ఆచార్య బీవీ రమణమూర్తిని సత్కరిస్తున్న ప్రముఖులు

బోట్‌క్లబ్: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, దియంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమెరికన్ కామెడీ నాటిక పోటీలు శనివారం రాత్రి దంటు కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా చిరంజీవిని కుమారి కళాప్రాంగణాన్ని విశిష్ట అతిథిగా హాజరైన సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి ప్రారంభించారు. ముఖ్య అతిథి ఉప్పులూరి సుబ్బరాయశర్మ, తనికెళ్ల భరణి జ్యోతి ప్రజ్వలన చేసారు. యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కర్ సభకు అధ్యక్షత వహించారు. వంగూరి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్ రాజు మాట్లాడుతూ నాలుగైదు దశాబ్దాల క్రితం తాను రాసిన 30 హాస్య నాటికల నుంచి 5 నాటికలను ఎంపికచేసి రెండురోజుల పాటు దంటు కళాక్షేత్రంలో ప్రదర్శిస్తారని తెలిపారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ చిట్టెన్ రాజు అమెరికాలో ఉంటూ, మన సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోకుండా, అనేక సాహితీ సదస్సులను నిర్వహిస్తూ తెలుగుభాషా సాహిత్యాలకు ఇతోధిక సేవలందించడం అభినందనీయమన్నారు. వేదికపై తనికెళ్ల భరణి చేతులమీదుగా 5 పుస్తకాలను ఆవిష్కరించారు. నాటక రంగానికి విశేష కృషి చేసిన ఆచార్య బీవీ రమణమూర్తి (మార్గశీర్ష), ఆచార్య డీఎస్ఎన్ మూర్తిని యంగ్‌మెన్ హ్యాపీ క్లబ్ తరఫున సత్కరించారు. హైదరాబాదుకు చెందిన మహతి క్రియేషన్స్ కళాకారులు యమసభ, శ్రీజయ ఆర్ట్స్ వారు 'మగపాత్ర లేని నాటిక' ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. కె.కృష్ణారావు, మార్ని జానకిరామ చౌదరి, సుచిత్రామూర్తి, పి.ప్రభుదాస్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

అన్నదాతకు ప్రయోజనకారి అజొల్లా

- పాడి పంటలకు ఎంతో ఉపయోగం
- పాడి గేదెలకు దాణాగా వినియోగం
- రిలయన్స్ ఆధ్వర్యంలో 18 మండలాల్లో సాగు

పెద్దాపురం: వ్యవసాయ పనులకు కూలీల రేట్లు పెరగడం, కూలీలు దొరకకపోవడం, వ్యవసాయ పనుల్లో యంత్రాల వినియోగం వల్ల ఎండుగడ్డి, కలుపు మందుల వల్ల పచ్చగడ్డికి కొరత ఏర్పడింది. ఇలాంటి సందర్భంలో పాడి రైతులకు 'అజొల్లా' ఒక వరంలా మారింది. పెరిగిన దాణా ఖర్చులు కూడా పశుపోషణకు కష్టంగా మారిన సమయంలో అజొల్లా వల్ల ఉపయోగాలు తెలపడానికి, పాడి పంటలకు అజొల్లా ఆవశ్యకతను తెలుపుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 18 మండలాల్లో సుమారు 3,500 మంది రైతులను ఎంపిక చేసి వారికి శిక్షణనిచ్చారు. రైతులు అజొల్లా సిద్ధం చేసి, పశువులకు మేతగా, ఎరువుగా వినియోగిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

వ్యవసాయం, పశువులు, జీవాలు, కోళ్ల పెంపకంలో అజొల్లా రైతులకు ఎంతగానో ఉపకరిస్తోంది. నాచు జాతికి చెందిన అజొల్లా ఇంటి ఆవరణలోనే అత్యంత సులభంగా పెంచుకునే అవకాశం ఉంది. పశుసంవర్ధక శాఖ, ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్), రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం జి.రాగంపేట, గోరింట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, గోకవరం, కరప, పెదపూడి, సామర్లకోట, కాజులూరు, తాళ్లరేవు, తుని, రౌతులపూడి, అమలాపురం రూరల్, ఐనవిల్లి, ముమ్మిడివరం, కోరుకొండ, అడ్డతీగల, రాజ ఒమ్మంగి, రంపచోడవరం మండలాల్లో అజొల్లాపై ప్రచారం విస్తృతంగా చేపట్టారు. పెంపకం చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారు.

పెంచుకునే విధానం

అజొల్లా పెంపకానికి కావలసిందల్లా కొన్ని సిమెంటు లేదా మామూలు ఇటుకలు, ఓ టార్పాలిన్ పట్టా, తాగు నీరు, పది కేజీల పశువుల పేడ, 200 కేజీల సారవంతమైన మట్టి, ఒక కేజీ అజొల్లా అవసరమవుతుంది. వీటి కోసం రైతులు ఖర్చు చేయాల్సింది కేవలం రూ.1000. సిమెంటు ఒరలు లేదా ఇటుకలతో తయారు చేసుకున్న తొట్టెలతో అజొల్లా పిట్‌ను తయారు చేసుకోవచ్చు. గ్రామంలో ఎవరైనా దీనిని పెంచుతుంటే వారి వద్ద నుంచి కొద్దిగా అజొల్లా కల్చర్‌ను తెచ్చుకుని తయారు చేసుకున్న పిట్‌లో వేస్తే చాలు జీవిత కాలం అజొల్లా పెరుగుతూనే ఉంటుంది. అవసరాన్ని బట్టి ఇంటి ఆవరణలో ఎన్ని అజొల్లా పిట్లనైనా తయారు చేసుకోవచ్చు.

ప్రయోజనాలు

- అజొల్లాను ఇంటి వద్దే పెంచుకోవచ్చు. పెంపకం కూడా సులువే.
- ఆవులకు, గేదెలకు, మేకలకు, కోళ్లతో పాటు చేపలకు ఆహారంగా ఉపయోగపడుతుంది.
- ప్రతి రోజూ పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక కేజీ వంతున పాలిచ్చే పశువుకి దాణాగా పెట్టడం వల్ల దాణా ఖర్చు తగ్గడమే కాకుండా పాల దిగుబడి పెరుగుతుంది, వెన్న శాతం పెరుగుతుంది. దీనిలో ప్రొటీన్లు, మాంసకృత్తులు అధికంగా ఉండడం వల్ల పశువు బలిష్టంగా ఉంటుంది. పశువులు సమయానికి ఎదకి వస్తాయి. దీని వల్ల పశు సంపద పెరుగుతుంది.
- వరి పైరుకు జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. అజొల్లాను వరి పొలంలో వేసుకోవడం వల్ల ఎకరాకు 8 నుంచి 12 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.
- అజొల్లాను పొలంలో వేయడం వలన మొక్క వేర్లకు ఆక్సిజన్ తగినంత అందుతుంది. ఫలితంగా యూరియా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు.
- పొలం నిండా అజొల్లా ఉండటం వల్ల నీరు త్వరగా ఆవిరి కాదు. ఫలితంగా నీటి తడులు అందించాల్సిన అవసరం చాలా తగ్గుతుంది.
- వరి పంటలో కలుపు రాకుండా అడ్డుకోవడంలో అజొల్లా ఎంతగానో ఉపయోగపడుతుంది.



కోళ్లకు మేతగా అజొల్లా

రైతులకు అవగాహన కల్పించాం



అజొల్లా ప్రతి రైతు ఇంట్లో పెంచుకోవాలి. దీని వల్ల రైతులు పెద్దగా కష్టపడాల్సిన అవసరం అవసం ఉండదు. కాస్త శ్రద్ధ తీసుకోవాలి. అజొల్లా పెంపకంపై 18 మండలాల్లోని రైతులకు అవగాహన కల్పించాం. సాగుకు రైతులకు సలహాలు అందిస్తున్నాం. కేవలం రూ.1000 పెట్టుబడితో నిరంతరాయంగా అజొల్లా తయారవుతుంది. రైతులు కూడా అజొల్లా పెంపకంపై ఆకర్షితులవుతున్నారు.

– బర్రె నాగేశ్వరరావు, ప్రాజెక్టు మేనేజర్, రిలయన్స్ ఫౌండేషన్, గోరింట, పెద్దాపురం మండలం

ఎరువుల స్టాక్ పాయింట్ల తనిఖీ



సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీలోని కోరమండల్ గోదాములో తనిఖీ చేస్తున్న అధికారులు

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని జి.మేడపాడులో కోరమండల్ ఇంటర్ నేషనల్ ఎరువుల గోదాములను శనివారం వ్యవసాయశాఖ, విజిలెన్సు అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో భౌతిక నిల్వలకు స్టాక్ రిజిస్టర్లకు ఎటువంటి వ్యత్యాసం లేదని మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ తెలిపారు. కోరమండల్ స్టాక్ పాయింట్‌కు ఆథరైజేషన్ పత్రాలు చూపలేదని చెప్పారు. దీంతో స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఎరువుల అమ్మకాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయాలని ఆదేశించామని చెప్పారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ స్పెషల్ బ్రాంచి సీఐ గోపాలరావు, తహసీల్దార్ కె.విజయకుమార్, వ్యవసాయశాఖ విస్తరణాధికారి ఎం.శాంతికమల పాల్గొన్నారు.